క్లుప్తంగా

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

నకరికల్లు: రానున్న వినాయకచవితిని పురస్కరించుకొని మండపాలు ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఎ.బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఉత్సవం నిర్వహించే వారు ఐదుగురు కమిటీగా ఏర్పడి ఏ ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేయనున్నారు, ఎన్నిరోజుల పాటు ఉత్సవం నిర్వహిస్తారో వివరంగా పొందుపరచాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసేవారు పంచాయతీ అనుమతి, ప్రైవేటు స్థలాల్లో ఏర్పాటు చేసేవారు స్థలయజమాని అనుమతులు తీసుకోవాలని సూచించారు.

బెల్లంకొండ: వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాలలో ఏర్పాటు చేసే గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ కె.అమీర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించే వివరాలను తెలియజేయాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదవాలని, చదువులతోపాటు వృత్తివిద్యలపట్ల ఆసక్తి చూపాలని పల్నాడు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎన్.లీలావతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన జూనియర్ ఇంటర్ విద్యార్థుల వెల్‌కం ఫంక్షన్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు కూడా అమ్మఒడి పథకం వర్తిస్తుందని చెప్పారు. అచ్చంపేట జూనియర్ కళాశాలలో గత యేడాది నుంచి ఎగ్జామినేషన్ సెంటర్ మంజూరైందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో తరగతి గదులు తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి బెస్ట్ అధ్యాపకురాలిగా ఎంపికైన కళాశాల ప్రిన్సిపాల్ జె.పద్మను సత్తెనపల్లి, బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జడ్ఎస్ రామచంద్రరావు, బత్తుల ఉమాదేవి, నర్సరావుపేట హర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ ఫిబే తదితరులు దుశ్శాలువాలు, పూలదండలు, జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల అధ్యాపకులు, సర్వశిక్ష అభియాన్ ఏఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలి

అచ్చంపేట: విద్యార్థులు చదువులతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనివ్వాలని, క్రీడాలు మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను, ఏకాగ్రతను ఇస్తాయని ఎంఈఓ మేడా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడలలో మండల స్థాయి జట్ల ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గ్రామీణ స్థాయినుంచి క్రీడాకారులను గుర్తించేందుకు అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు వేరువేరుగా కబడి, ఖోఖో, యోగా, త్రోబాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ జట్లను ఎంపికలు చేసినట్లు చెప్పారు. మండలంలోని అచ్చంపేట, వేల్పూరు, మాదిపాడు, కొండూరు, పెదపాలెం, కోనూరు గ్రామాలలోగల జిల్లా పరిషత్ హైస్కూల్స్‌నుంచి 100కి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి గేమ్‌లో ఒక్కో పాఠశాల నుంచి ఇద్దరు బెస్ట్ క్రీడాకారులచొప్పున గుర్తించి అన్ని పాఠశాలల నుంచి మండల స్థాయి జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి జట్టుతో పోటీ పడతారన్నారు. ఆ తరువాత జిల్లా స్థాయి, ఆపై రాష్ట్రస్థాయిలో విద్యార్థులు పోటీపడవలసి ఉంటుందన్నారు. ఎంఈవో-2 నరసింహారావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్ కల్యాణి, వ్యాయామ ఉపాధ్యాయులు ఆలపాటి సుజాత, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పాపాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామ సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. రెండవ రోజు జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొంటారని ఎంపీపీ తెలిపారు. సాయంత్రం 5 గంటల నుండీ రాత్రి 9గంటల వరకూ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు. తొలుత సాయంత్రం 4 గంటలకు బెల్లంకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

క్రోసూరు: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ రకాల ప్రధాన పంటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి మండల వ్యవసాయాధికారి వి.వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఈఏడాది ఖరీఫ్‌లో పత్తి 11,089 ఎకరాలు, మిర్చి 2930 ఎకరాలు, వరి 976 ఎకరాల్లో సాగు అవుతున్నట్లు తెలిపారు. రైతులందరూ తప్పని సరిగా యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలన్నారు. పత్తి, మిర్చి పంటలను కాపాడుకొనేందుకు వ్యవసాయాధికారితో చర్చించి తగు విధంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వరి నారు చనిపోయిన చోట్ల వత్తుగా ఉన్న నారు లేదా నారు తీసుకొచ్చి 25 రోజులలోపు చనిపోయిన మొక్కల స్థానంలో నాటాలని తెలిపారు.

సంక్షేమం.. నిత్య నూతనం

- సంక్షేమాన్ని గడప వద్దకే తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- ధరణికోటలో నూతన పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



నూతన పింఛన్లను అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: దళారీ వ్యవస్థను నిర్మూలించి, అవినీతిని లేకుండా నేరుగా గడప వద్దకే సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధరణికోట సచివాలయంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను ఎమ్మెల్యే శంకరరావవు చేతల మీదుగా . నూతనంగా మంజూరైన 54 పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ.. ధరణికోట పరిధిలో సుమారు రూ. 43 లక్షలు ప్రతి నెలా వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా అందిస్తున్నామన్నారు. గతంలో తెలుగు దేశం పార్టీ ఇందులో నాలుగో వంతు కూడా ఇవ్వలేదన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులందరికీ పెన్షన్లు అందజేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. నాడు పెన్షన్ కోసం గంటల కొద్దీ క్యూ లైన్లలో నిలబడాల్సి వచ్చేదని, నేడు జగనన్న పాలనలో వలంటీర్లు నేరుగా ఇంటికే వచ్చి అందజేస్తున్నారన్నారు. గత నాలుగేళ్లలో పెదకూరపాడు నియోజక వర్గాన్ని సుమారు రూ.వెయ్యికోట్లతో అభివృద్ధి చేశామన్నారు. అలాగే రూ.150 కోట్లతో అమరావతి - బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు, అమరావతి - తుళ్లూరు డబుల్ లైన్ రోడ్డుతో పాటు మద్దూరు వద్ద హైలెవల్ బ్రిడ్జిని రూ.44కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. గతంలో 20 ఏళ్ల ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసినవారు, పదేళ్ల ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకులు ఈనాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిలో కనీసం పది శాతమైనా చేశారా అని ప్రశ్నించారు. జగనన్న నేతృత్వంలో నాలుగేళ్లలో నియోజకవర్గ రూపురేఖలు మార్చామన్నారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజనపథకం ద్వారా మంజూరైన టీవీఎస్ బైక్‌ను లబ్ధిదారుడు లంకె గంగాధరరావుకు అందజేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత..

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని ధరణికోటకు చెందిన పైకం అంకరాజు మరణించాడు. వారి కుటుంబ ఆర్థిక స్థితులు తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరరావు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించి, మంజూరుకు కృషి చేశారు. బుధవారం పైకం అంకరాజు కుటుంబసభ్యులకు రూ.3 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాసు పావని, వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, ఆలపాటి వీరయ్య, కొండవీటి కోటేశ్వరరావు, మాదాసు రాంబాబు, నాగరాజు, మత్తయ్య, బాచిన శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటాద్రి గ్రామస్తులు పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: అర్హత ఉన్నవారికి సత్వరమే పింఛన్ మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందని వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగపాడు, త్రిపురాపురం గ్రామాలకు చెందిన 21 మందికి నూతనంగా మంజూరైన పింఛన్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన చీమలదిన్నె తిరుపతమ్మ అనే మహిళ పక్షవాతంతో బాధపడుతున్నట్లు జులై 19న జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా తెలుసుకున్నామన్నారు. పక్షవాతం వారికి పింఛన్ ఇస్తారన్న విషయం తెలియక ఆమె దరఖాస్తు చేసుకోకపోవడంతో సత్వరమే ఆమె ఇంటికి అధికారుల బృందంతో పాటు తానుకూడా వెళ్లి దరఖాస్తు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. నెలరోజుల వ్యవధిలోనే కొత్తపింఛన్ మంజూరు కావడం లబ్ధిదారురాలికి పంపిణీ చేయడం జగనన్న సుభిక్ష పరిపాలనకు నిదర్శనమని కొనియాడారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలో కొత్తగా మొదటివిడతలో 188 మందికి పింఛన్‌లు మంజూరు కాగా రూ5,28,500లు, రెండోవిడతలో 383మందికి రూ10,90,250లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో సంగు రామకోటమ్మ, ఉపసర్పంచ్ రొండా రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెరికపాడులో...

పెరికపాడు(క్రోసూరు): మండలంలోని పెరికపాడు గ్రామంలో బుధవారం గ్రామానికి వచ్చిన కొత్త పెన్షన్లను లబ్ధిదారులకు సర్పంచ్ ఊడల శ్రీదర్ సమక్షంలో పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహాయ సహకారాలతో గ్రామానికి సెప్టెంబర్ నెలకు 20 పెన్షన్లు అదనంగా మంజూరయ్యాయని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ రవికుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకయ్య, వలంటీర్లు, ఎంపీటీసీ సబ్బసొతు ఆరుణాబాయి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ఎం.రమేష్ పాల్గొన్నారు



తిరుపతమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శికి పింఛన్ అందజేత



పెదకూరపాడు: కుల,మత, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామని పెదకూరపాడు ఎమ్మెలే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావుకు నూతనంగా మంజూరైన పింఛన్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ అందజేస్తున్నారని, అందుకు శ్రీనివాసరావుకు పింఛన్ మంజూరే నిదర్శనమన్నారు.

అర్హత ఉంటే చాలు..

సత్తెనపల్లి నియోజకవర్గానికి 1,061 నూతన పింఛన్లు



సత్తెనపల్లిలో నూతన పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి

సత్తెనపల్లి: ప్రతి ఆరునెలలకొక పర్యాయం కొత్త పింఛన్లు మంజూరవుతూనే ఉన్నాయి. సామాజిక భరోసాగా నిలుస్తున్న పింఛన్ల మంజూరులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాజకీయాలను చూడడం లేదు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అర్హుడా ? కాదా ? అనే విషయాన్ని మాత్రమే అధికారులు పరిశీలిస్తున్నారు. అర్హత ఉంటే వెంటనే పింఛన్ పంపిణీ చేస్తున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పింఛన్ల మంజూరులో ఉదారంగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు కూడా దరఖాస్తు చేసుకుని అర్హత ఉంటే పెన్షన్లను పొందుతున్నారు. ఇటీవల కొత్తగా సత్తెనపల్లి నియోజకవర్గానికి 1,061 నూతన పింఛన్లు కేటాయించారు.

సచివాలయాల ద్వారా ..

వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు. అర్హత కలిగి ఉంటే 21 రోజుల్లో పింఛన్లను మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఎవరికీ ఒక్క రూపాయి సమర్పించాల్సిన పనికూడా లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు పెత్తనం చేసేవి. వారు దయ చూపితేనే పింఛన్లు మంజూరయ్యేవి. అర్హత ఉన్నా టీడీపీకి చెందిన వారు కాకుంటే మంజూరు చేసేవారు కాదు. అప్పట్లో పెన్షన్ల కోసం ఎదురు చేసిన వారు .. కాళ్లరిగేలా తిరిగిన వారంతా ఇప్పుడు లబ్ధి పొందుతు న్నారు. వృద్ధులు , దివ్యాంగులైతే సచివాలయాల వద్దకు కూడా వెళ్లకుండా వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని నగదును పొందుతున్నారు.

మొత్తం 38,830 పింఛన్లు ....

సత్తెనపల్లి నియోజకవర్గంలో కొత్త పింఛన్లతో కలిపి 38,830 వివిధ రకాల పింఛన్లను అందజేస్తున్నారు. ఇందుకోసం గత ప్రభుత్వ హయాంలో కొద్ది మందికి మాత్రమే నియోజకవర్గంలో పింఛన్లను అందజేసేవారు. పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారుడు చనిపోతే తప్ప కొత్తవారికి పింఛన్ మంజూరు చేసే అవకాశం లేదనే నిబంధన అమలు చేయడంతో కొత్త వాటిని మంజూరు చేసింది లేదు. గతం, ఇప్పటితో పోల్చి చూస్తే 50 శాతం పింఛన్లు పెరిగినట్టుగా అధికారులు వెల్లడిస్తున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో పెన్షన్‌లు, కొత్త పెన్షన్‌ల మంజూరు...

మండలం	పెన్షన్‌లు	నగదు	కొత్త పెన్షన్‌లు
సత్తెనపల్లి టౌన్	6,214	1,72,96,250	189
సత్తెనపల్లి రూరల్	10,403	2,87,32,500	334
ముప్పాళ్ళ	6,007	1,64,54,750	155
రాజుపాలెం	6,911	1,90,34,500	167
నకరికల్లు	8,234	1,93,42,500	216
మొత్తం	37,769	10,08,60,500	1,061

రాజుపాలెంలో 72మందికి...

రాజుపాలెం: అర్హత ఉంటేచాలు ప్రభుత్వ పథకాలు ఇంటివద్దకే వస్తాయని సర్పంచ్ పులిబండ్ల అశోక్ అన్నారు. రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా 72 పింఛన్‌లు మంజూరుకాగా బుధవారం పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి సురేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: దోచుకునేవారిని, దాచుకునేవారిని నమ్మవద్దని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలో నూతనంగా మంజూరు అయిన 200 మంది పెన్షన్‌లు ఆయన బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి పేదవానికి ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు వస్తున్నాయన్నారు. టీడీపీ పాలనలో పెదకూరపాడు మండలంలో కేవలం 1253 మందికే పెన్షన్ వచ్చేదని, జగనన్న పాలనలో 1619 మందికి రూ. 45 లక్షలు పెన్షన్ ఇస్తున్నట్లు వెల్లడించారు. మండలంలో 7,944 మంది రూ. 2.20 కోట్లు పెన్షన్ రూపంలో అందుతున్నట్లు తెలిపారు. గత పాలనలో కనీసం రోడ్లు కూడా వేయలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో మండలంలో లగడపాడు, కొనగండ్ల, కాశిపాడు, పాటిబండ్ల, చినమక్కెన గ్రామాల్లో రోడ్లు వేశామన్నారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సొంత గ్రామమైన పెదకూరపాడుకు ఏమి చేయలేదని విమర్శించారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, నల్లపాటి యోహాను, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, జిల్లా పార్టీ కార్యదర్శి కంకణాల శివాజీ, షేక్‌బాషా, మేరి రాణి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

కౌలు రైతులకు రూ.1.52కోట్ల పంటరుణాలు

నకరికల్లు: కౌలుదారు రైతులకు పంటరుణాలు సకాలంలో మంజూరు చేయాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి బ్యాంకర్లను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి బ్యాంకర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా శాఖలవారీగా ప్రభుత్వ పథకాలకు బ్యాంకుల ద్వారా మంజూరైన నిధులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో బ్యాంకర్ల పాత్రపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 214మంది కౌలురైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ1.52కోట్ల పంటరుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. తహశీల్దార్ కె.నగేష్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు పొంది, కౌలుకు భూములు సాగుచేస్తున్న రైతులకు పంటరుణాలు ఇవ్వాలని కోరారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ అటవీ భూములకు హక్కుపత్రాలు ఉండి సాగుదారు రైతులకు పంటరుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను ప్రత్యేకంగా కోరారు. పలుబ్యాంకుల మేనేజర్‌లు, వైఎస్సార్ కాంత్రిపథం సీసీలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ పంట రుణాలు కల్పించాలని సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బ్యాంకర్స్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి మండలంలో 2,700 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. సీసీఆర్సీ కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు పంట సాగుపై రుణాలు అందించాలన్నారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్.సురేష్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, పలు బ్యాంకుల అధికారులు

కట్టమూరులో నేత్రవైద్య శిబిరం

సత్తెనపల్లి: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి మరో వ్యక్తికి ప్రాణదాతలుగా మారాలని నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ వాసుదేవరావు అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలోని గాస్పల్ మిషన్ చర్చ్‌లో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్ర గుంటూరు అనుబంధ సంస్థ, చెరుకుపల్లి కామాక్షి ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ దార్ల సంధ్య సహకారంతో నేత్ర దానంపై అవగాహన, ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ వాసుదేవరావు మాట్లాడుతూ సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్షలు చేయించు కున్నట్లయితే కంటి సంరక్షణ బాగుంటుందన్నారు. డయాబెటిక్ వలన కంటి చూపు తగ్గే ప్రమాదం ఉందని, డయాబెటిక్ ఉన్న వృద్ధులు సక్రమంగా మందులు వాడుతూ కొద్దిపాటి నడక, సమయానికి భోజనాన్ని తీసుకోవాలన్నారు. శిబిరంలో 120 మందికి పరీక్షలు చేయగా 12 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, దార్ల ఏడుకొండలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గులాబీరంగు పురుగు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): పత్తి పంటకు నష్టం కలిగించే చీడపీడల్లో గులాబీరంగు పురుగు ప్రధానమైందని, తగిన సమయంలో జాగ్రత్తలు పాటిస్తే ఉధృతిని తగ్గించుకోవచ్చని జిల్లా డాట్‌సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో పత్తి పొలాలను బుధవారం పరిశీలించారు. గులాబీరంగు పురుగు పత్తి పంటకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందని, దీనివలన దిగుబడులు తగ్గటంతో పాటుగా నాణ్యత దెబ్బతింటుందన్నారు. పెట్టుబడులు కూడా రాకుండా పోతాయన్నారు. గులాబీరంగు పురుగు ఆశించిన పూలు, మొగ్గలు రాలిపోతాయన్నారు. ముదరక ముందే పత్తికాయలు పక్వానికి వచ్చి విచ్చుకుంటాయని, గులాబీరంగు పురుగు నివారణకు రైతులు కొన్ని రకాల జాగ్రత్త చర్యలు చేపట్టడం ద్వారా దీని ఉధృతిని నివారించుకోవచ్చన్నారు. పురుగును, గుడ్డు దశలను నిర్మూలించేందుకు లీటరు నీటికి 5 మి.లీ.వేపనూనెను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి తగ్గాలంటే ప్రొఫెనోఫాస్ 50శాతం ఈ.సీ 400 ఎం.ఎల్ లేదా నోవల్‌రిన్ 5.25శాతాన్ని ఇండోక్సికార్బ్ 4.5% 400 ఎం.ఎల్ ను 200 లీటర్ల నీటికి కలిపి ఉదయం గాని సాయంత్రం వేళల్లోగానీ పిచికారీ చేయాలన్నారు. ఏఓ ఎం.అరుణ, వీఏఏ శైలజ, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పెదకూరపాడు: తాను ఎప్పుడూ మీ కుటుంబ సభ్యుడినేనని, ఏ అవసరం వచ్చినా స్వయంగా తనను కలిసి తమ బాధలు చెప్పుకోవచ్చని నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హామీ ఇచ్చారు. బుధవారం పెదకూరపాడు మండలం కంబంపాడు గ్రామానికి చెందిన కుంభా అనిల్‌కుమార్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 3 లక్షల చెక్కును ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందించారు.

భవన నిర్మాణాలు సత్వరం పూర్తి చేయాలి

పెదకూరపాడు: అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం గుంటూరులోని తన కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో రూ. 28 కోట్లతో సచివాలయాలు, రూ. 15 కోట్లతో రైతు భరోసా కేంద్రాలు, రూ.9 కోట్లతో సెల్ఫ్‌వెల్‌నెస్ సెంటర్‌ల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ. 14 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. రూ. 3.75 కోట్ల ఎంపీ నిధులతో వివిధ అభివృద్ధి పనులు, రూ. 6.75 కోట్ల డీఎంఎఫ్ నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈలు, ఏఈలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాదలలో 'పోషణ మహ'

మాదల(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి పరిధిలోని ఇరుకుపాలెంలో గల మాదల గ్రామంలో పోషణమహ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని దైనందిన జీవితంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటిపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, గుడ్లు, పండ్లు, పాలను ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఐరన్, కాల్షియం ఎక్కువగా ఉండే పోషక విలువలు గల ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ సింగంశెట్టి కోటేశ్వరమ్మ, ఎంపీపీఎస్ పాటశాల హెచ్ఎం కోటేశ్వరరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.పుష్పవాణి, ఏఎన్ఎం నీరజ, అంగన్‌వాడీ కార్యకర్తలు వీరమ్మ, అంజమ్మ, వీరకుమారి, సుధారాణి, అనురాధ, శాంతి, అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు సీతమ్మ, గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

సర్కారు అండ 'గుండె'

'స్టెమి'తో సత్ఫలితాలు

- సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో హృద్రోగులకు ప్రత్యేక వైద్య సేవలు
- ఏరియా వైద్యశాలలో అందుబాటులో రూ.40 వేల ఖరీదైన ఇంజక్షన్లు
- గుండెపోటుతో వచ్చిన లక్ష్మి అనే మహిళకు స్టెమితో తప్పిన ప్రాణాపాయం



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో గుండెపోటుతో వచ్చిన మహిళకు సేవలందించిన వైద్య బృందం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చింది. పేదలకు గుండెకు భరోసాను కల్పించింది. కరోనా తర్వాత వయసులతో సంబంధం లేకుండా గుండెపోట్లు అధికంగా సంభవించడంతో ప్రభుత్వం హృద్రోగాలపై దృష్టిసారించింది. నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగానే ఎంపిక చేసిన వైద్యశాలల్లో గుండెపోటు వచ్చిన వ్యాధిగ్రస్తులకు కార్పొరేట్ వైద్యశాలలో అందించే ఖరీదై రూ.40 వేల విలువైన ఇంజక్షన్ల అందజేతకు స్టెమి పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. గోల్డెన్ అవర్‌గా పేర్కొనే తొలి గంట చాలా కీలకమైనదని వైద్యులు ధ్రువీకరించడంతో అందుకు అవసరమైన ప్రాథమిక చికిత్సను ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేక గదిని, 24 గంటలు పని చేసేలా సుశిక్షితులైన సిబ్బందిని, ఆధునిక ఈసీజీ పరికరాలను సమకూర్చింది. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోనూ హృద్రోగ వైద్యం కోసం ప్రత్యేక వసతులు కల్పించింది.

ప్రాణాపాయం తప్పింది

సత్తెనపల్లి పట్టణంలోని 11వ వార్డుకు చెందిన సంగం బాలకోటిరెడ్డి, లక్ష్మి దంపతులు వ్యసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. లక్ష్మికి మంగళవారం రాత్రి ఛాతిలో నొప్పి రావంతో పాటు వాంతులయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. సత్వరం స్పందించిన సుశిక్షితులైన వైద్యసిబ్బంది లక్ష్మికి ఈసీజీ తీశారు. ఆ కాపీని గుంటూరు కార్డియాలజీ విభాగానికి పంపించారు. వారి సూచనల మేరకు గుండె పోటుగా నిర్ధారించి రూ.40 వేల విలువైన ఇంజక్షన్ లక్ష్మికి ఇచ్చారు. అనంతరం తిరిగి ఆమెకు ఈసీజీ చేయగా మెరుగైన ఫలితాలు కనిపించాయి. లక్ష్మికి ప్రాణాపాయం తప్పింది. అనంతరం 108 ద్వారా మెరుగైన చికిత్సకు గుంటూరు సమగ్ర వైద్యశాలకు ఆమెను తరలించారు. రాత్రి 9 గంటలకు ఆమె ఆస్పత్రికి రాగా, అర్ధగంట వ్యవధిలో ఆమె ఆరోగ్యం కుదుటపడింది. స్థానికంగా సదుపాయం అందుబాటులో ఉంచడం వల్లే లక్ష్మి ప్రాణాలు దక్కాయని ఆమె కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

భరోసానిస్తోంది



గోల్డెన్ అవర్‌లో హృద్రోగానికి చికిత్స అందించేలా ప్రభుత్వం చేపట్టిన 'స్టెమి' కార్యక్రమం పేదలకు ఎంతో భరోసానిస్తోంది. సత్తెనపల్లి పట్టణానికి చెందిన లక్ష్మి సకాలంలో ఏరియా వైద్యశాలకు రావడంతో సత్వర చికిత్స అందించి ప్రాణాలు కాపాడగలిగాం . ఏరియా వైద్యశాలలో అవసరమైన ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ సరికొండ గిరిరాజ్, ఎండీ, జనరల్ మెడిసిన్, సత్తెనపల్లి

పైసా ఖర్చు లేకుండా..



గుండెపోటు వచ్చిందంటే చాలు ప్రైవేట్ వైద్యశాలలకు వెళితే రూ.లక్షలు ఖర్చుచేయాల్సిన దుస్థితి. ఈ భారాన్ని భరించలేక ఎన్నో పేద గుండెలు జారిపోతున్నాయి. ఈ పరిస్థితికి ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. ప్రభుత్వ వైద్యశాలల్లోనే హృద్రోగ చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చింది. సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో స్టెమి పేరుతో ప్రత్యేక వైద్య వసతి కల్పించారు. ఇది పేదలకు భరోసానిస్తోంది.

– కొత్త రామకృష్ణ, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్, సత్తెనపల్లి